# 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- నియోజవకర్గంలో 26 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 5415 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

**గాజువాక:** పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానుండటంతో విద్యాశాఖాధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 5,415 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 1804 మంది కాగా, ప్రైవేట్ పాఠశాలల నుంచి 3611 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. మొత్తం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పూర్తిస్థాయిలో బెంచీలు, విద్యుత్ సౌకర్యం, మంచినీరు, మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనున్నందున తొలిరోజు ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతీ కేంద్రం వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు.

**కేంద్రాల వద్ద 144 సెక్షన్**

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ ఆంక్షలను విధిస్తూ సౌత్ డివిజన్ ఏసీపీ టి.త్రినాథ్ శనివారం ఉత్తర్వులను విడుదల చేశారు. సౌత్ సబ్ డివిజన్‌లోని అన్ని కేంద్రాల వద్ద ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సెక్షన్ 144ను అమలు చేయనున్నట్టు తెలిపారు.

**పెదగంట్యాడ మండలంలో 6 కేంద్రాలు**

**పెదగంట్యాడ:** సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యా శాఖాధికారులు శ్రీనివాసరావు, రమణాజీ తెలిపారు. మండలంలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో, రెండు ప్రైవేటు పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని 1440 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాల్లో 480 మంది, ఇస్లాంపేట హైస్కూల్లో 240 మంది, గంగవరం హైస్కూల్లో 240 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలలు అయిన విశాఖ విమల విద్యాలయం, చైతన్య పాఠశాలల్లో 480 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

**కణితి హైస్కూల్ నుంచి 232 మంది ..**

**కూర్మన్నపాలెం:** కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 232 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు తెలిపారు. వారిలో బాలికలు 121 మంది, బాలురు 111 మంది ఉన్నారన్నారు. గాజువాక పరిధిలోని మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో తమ పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

# రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ భూపతిరాజు సుజాతను సత్కరిస్తున్న స్థానికులు



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



88వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో 1కోటి 50 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కోటి రూపాయలతో కర్ణవానిపాలెంలో డ్రెయిన్, చిన నడుపూరులో రోడ్లు, కల్వర్టు, ఆదర్శగ్రౌండ్ ఏరియాలో కాల్వలు నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.50 లక్షలతో సీతారామ్‌నగర్, గొంతినవానిపాలెం, పైడిమాంబ కాలనీ, సింహగిరి కాలనీల్లో రోడ్లు, కాల్వలు నిర్మిస్తారన్నారు. కార్పొరేటర్ భూపతి రాజు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కులుకూరి మంగరాజు, గొందేశి వెంకటరమణారెడ్డి, పైడిరాజు, రామకృష్ణ నాయుడు, అప్పారావు, వరలక్ష్మి, మంజు, బొట్ట సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

**కొండవాలులో సీసీ రోడ్ నిర్మాణానికి..**

**గాజువాక :** 67వ వార్డు పెంటయ్యనగర్ ఏరియా కొండవాలు ప్రాంతంలో సీసీ రోడ్, కాలువలు, మెట్ల మార్గం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.36 లక్షలతో ఈ పనులను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. గాజువాకలోని అన్ని కొండవాలు ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, స్థానిక నాయకులు పల్లా పెంటారావు, యువశ్రీ, రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**88వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి..**

**అగనంపూడి:** జీవీఎంసీ 88వ వార్డు కాపుజగ్గరాజుపేట సమీపంలోని సత్యానగర్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి కనక మహాలక్ష్మి నాయుడు, వార్డు సచివాలయ కన్వీనర్ నమ్మి ప్రసాద్, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**88వ వార్డులో కళ్యాణమండపం నిర్మాణానికి..**

**కూర్మన్నపాలెం:** జీవీఎంసీ 88వ వార్డు యాదవజగ్గరాజుపేటలో సుమారు 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న కల్యాణ మండపానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి చొరవతో కళ్యాణమండపం నిర్మాణానికి నిధులు సమకూరాయని, త్వరలోనే పనులు పూర్తి చేసుకుని అందుబాటులోకి రానుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గంధ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, సచివాలయ కన్వీనర్ నమ్మి ప్రసాద్, ఇతర కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీలోకి ఇంజినీరింగ్ విద్యార్థులు

- మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో చేరిక



మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యువకులు

**అక్కిరెడ్డిపాలెం:** గొన్న ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కళాశాల సెక్రటరీ హేమచంద్ ఆధ్వర్యంలో మంత్రిని శనివారం ఆయన నివాసంలో కలిసి, పార్టీలో చేరారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు, నాయకులు పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. హేమచంద్ మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన ముఖ్యుల్లో టి.మదన్, బి.తేజ్, వై.మణికంఠ, ఎ.కుమార్, బి.హేమంత్, ఎ.జగన్, టి.శివ, టి.బాలాజీ, బి.హరి, కె.శివ కుమార్, ఎల్.శ్రీను తదితరులున్నారు.

### ఎంపీపీ పాఠశాలకు మ్యాథ్స్ కిట్ల అందజేత

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఎండీ సాహెబ్‌పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలకు హిందూజా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ మ్యాథ్స్ కిట్లు అందించింది. సంస్థ ప్రతినిధులు వినోద్, అప్పారావు, జగదీష్ శనివారం పాఠశాలను సందర్శించి, ప్రధానోపాధ్యాయిని ఎం.ఎస్.లక్ష్మికి ఈ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసరావు, రమణాజీ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రెండేళ్ల లోపు చిన్నారులకు మానవ వికాస వేదిక ప్రతినిధులు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఆర్పీలు, ఎస్ఆర్పీలు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు

**పెదగంట్యాడ:** ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీడీపీవో నీలవేణి తెలిపారు. 64వ వార్డు గొడ్డువానిపాలెం కేంద్రంలో ఆయా పోస్టుకు బీసీ ఈ, 74వ వార్డు దల్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టుకు ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ వైజాగ్ స్టీల్ ప్రతినిధులు

**పెదగంట్యాడ:** వాసవీ క్లబ్ వైజాగ్ స్టీల్, వనిత వైజాగ్ స్టీల్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చక్కా బంగార్రాజు, నాగేశ్వరరావు, కట్టా సతీష్, వీఆర్‌పీఎన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బలగాల కవాతు



గాజువాక మెయిన్ రోడ్‌లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

**గాజువాక:** ఎన్నికల నేపథ్యంలో కేంద్ర రక్షణ బలగాలు గాజువాకలో శనివారం కవాతు నిర్వహించాయి. గాజువాక పోలీసుల సారథ్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలు కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు, అక్కడి నుంచి కొత్త గాజువాక వరకు కవాతు చేశాయి. ఈ సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై కూడా పోలీసు ఉన్నతాధికారులు వివరాలను సేకరించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

- 22 మందికి రూ.12.6 లక్షలు అందజేత



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

**పెదగంట్యాడ:** తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతూ, ఆరోగ్య శ్రీ పథకంలో లేని వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం సాయం అందిస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 22 మందికి రూ.12 లక్షల 60 వేలు సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం ఉదయం ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల వైద్యానికి ప్రభుత్వం అన్ని విధాలా భరోసా కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, మామిడి శ్రీను, సాపే బ్రహ్మయ్య, మంత్రి శంకర నారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, గొందేశి శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు జాబ్‌మేళా

- 126 మందికి ఉపాధి అవకాశాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

**గాజువాక:** ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి శిక్షణ ఇవ్వడం, ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు అన్నారు. గాజువాక శ్రీనగర్‌లోని టీఎస్ఆర్ అండ్ టీబీకే డిగ్రీ కళాశాలలో దివ్యాంగులకు నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమాంతరంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుండడం గొప్ప విషయమన్నారు. దివ్యాంగులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన రైస్, హజారీ గ్రూప్, కల్చర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత కరణంరెడ్డి నర్సింగరావు, కళాశాల డైరెక్టర్ బలరామకృష్ణ, ట్రైన్ ట్రస్ట్ దక్షిణ భారతదేశ ఇన్‌చార్జి ఎస్.సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి, రైస్ అధినేత అమరేంద్ర, హజారీ గ్రూప్ అధినేత ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో 126 మందికి ఉపాధి కల్పించారు.

## ఆలిండియా ఇంటర్ స్టీల్ బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట




బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రకాశ్

**ఉక్కునగరం:** ఆలిండియా ఇంటర్ స్టీల్ బాక్సింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన క్రీడాకారులు జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకు టాటానగర్‌లో నిర్వహించిన పోటీల్లో సబ్ జూనియర్ కేటగిరీలో హాజరైన ఎస్.నరేంద్రకుమార్, ఎం.దిలేష్, కె.సాయి లోహిత్ బంగారు పతకాలు గెలుపొందారు. జూనియర్ కేటగిరీలో హాజరైన ఎం.లిఖిత్ కుమార్, ఎస్.రామ్‌చరణ్ కుమార్, కె.దేవి ప్రసాద్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మరో క్రీడాకారుడు కె.దేవిశ్రీ ప్రసాద్ క్వార్టర్ ఫైనల్స్‌లో స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఈ పోటీల్లో జూనియర్ కేటగిరీలో బెస్ట్ బాక్సర్‌గా ఎస్.రామ్ చరణ్ కుమార్, సబ్ జూనియర్ కేటగిరీలో ఎం.దిలేష్ ఎంపికయ్యారు. విజేతలు ఈ నెల 18 నుంచి 25 వరకు నోయిడాలో జరిగే సబ్ జూనియర్ నేషనల్, సబ్ జూనియర్ పోటీలకు హాజరు కానున్నారు. అలాగే, ఉక్కునగరానికి చెందిన కె.సాయి కిరణ్, సిహెచ్.చాతుర్య నోయిడాలో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ విభాగంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్ విజేతలను, కోచ్ కె.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ బి.రామారావు, రిఫరీ ఎస్.వి.శర్మలను అభినందించారు. కార్యక్రమంలో ఎం.వి.మురళీమోహన్, జార్జ్, గోపి, కాశీ పాల్గొన్నారు.

## ఫుట్‌బోర్డ్‌పై ఫోన్ మాట్లాడేవారే టార్గెట్

- సెల్‌ఫోన్ల చోరీ నిందితుడు అరెస్ట్
- 13 స్మార్ట్ ఫోన్లు స్వాధీనం



నిందితుడు అప్పారావుతో దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారాం, సిబ్బంది

**అగనంపూడి:** నెమ్మదిగా వెళ్తున్న రైళ్లలో ఫుట్‌బోర్డు వద్ద ఫోన్ మాట్లాడుతున్న వారి సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న నిందితుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి.. అగనంపూడి ప్రాంతానికి చెందిన గాడి అప్పారావు కొద్ది రోజులుగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఔటర్, హోమ్ సిగ్నల్ పాయింట్ల వద్ద మాటువేసి నెమ్మదిగా కదులుతున్న రైళ్లలో ఫుట్‌బోర్డుల వద్ద నిల్చుని, కూర్చుని మొబైల్ వాడుతున్న వారిని టార్గెట్ చేశాడు. ఫుట్‌బోర్డు వద్ద మొబైల్‌తో ఉంటే చాలు.. మొబైల్‌పై కర్రతో మోదుతూ ఫోన్ చేయి జారిపోయేలా చేస్తున్నాడు. కిందపడిన మొబైల్ ఫోన్లను తీసుకువెళ్లి, వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. నిత్యం ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటుండడంతో విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో క్రైం సిబ్బంది సహకారంతో దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారాం శుక్రవారం దువ్వాడ ఔటర్ వద్ద ఇదే తరహాలో దొంగతనానికి పాల్పడుతున్న అప్పారావును అదుపులోకి తీసుకున్నారు. నిందితుని నుంచి రూ.65వేల విలువైన 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

# అమరజీవి సేవలు అజరామరం

- పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని స్మరించుకున్న వక్తలు
- ఘనంగా జయంతి వేడుకలు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



స్టీల్‌ప్లాంట్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**గాజువాక :** తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, తన ప్రాణాన్నే పణంగా పెట్టిన యోధుడు పొట్టి శ్రీరాములు అని అమ్మ వాసవి ట్రస్ట్ ప్రతినిధులు పేర్కొన్నారు. అమరజీవి సేవలు అజరామరమన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ట్రస్ట్ ప్రతినిధులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కులుకూరి మంగరాజు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాన్ని సాధించి తెలుగు జాతి సగర్వంగా తలెత్తుకు తిరిగేలా చేసిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరద కృష్ణ, తీగల శ్రీనివాసరావు, బెల్లాల పెంటబాబు, పోలిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ గ్రంథాలయంలో..**

**పెదగంట్యాడ:** ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు సేవలు మరువలేమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అగనంపూడిలో..**

**అగనంపూడి:** పొట్టి శ్రీరాములు జయంతిని 79వ వార్డు పాత అగనంపూడి కూడలిలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ సేవా సంఘం కన్వీనర్ చిత్తా రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ పి.నాగేశ్వరరావు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.వరప్రసాద్, ముత్తుస్వామి, వెంకటరావు, రామునాయుడు, ఎస్.అప్పారావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**స్టీల్‌ప్లాంట్‌లో..**

**ఉక్కునగరం:** పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో హిల్‌టాప్ కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, నాయకులు ఎన్నేటి రమణ, పిట్టా రెడ్డి, కె.జనార్దన్, ఎస్.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 204 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ శిబిరంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

**గాజువాక :** గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 204 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించిన శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.11.65 కోట్ల విలువైన కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపాయి. ఐదు బెంచీల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, పల్లవి, వై.ప్రేమలత, బార్ అసోసియేషన్ ప్రతినిధులు వి.ఎం.కృష్ణ,సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### 'ఉక్కు' పరిరక్షణ అందరి బాధ్యత

**కూర్మన్నపాలెం:** స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న నిరాహార దీక్షల్లో 1129వ రోజు సంస్థకు చెందిన ఎస్ఎంఎస్.2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు.

## మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాదకద్రవ్యాల నిరోధంపై ప్రసంగిస్తున్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిశోర్ కుమార్

**కూర్మన్నపాలెం:** మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మాదకద్రవ్యాల నిరోధంపై సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో గ్రీన్‌సిటీ వైజాగ్ ప్రొఫైల్ ఆఫీస్ నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి కుటుంబ విలువలు పెరిగేలా ప్రవర్తించాలని సూచించారు. సింహాద్రి టీఎంటీ అధినేత బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా మాదవద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారన్నారు. కోస్టల్ ఆంధ్ర బీసీ వెల్ఫేర్ అధ్యక్షుడు నరవ రాంబాబు, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఎస్. శ్రీనివాస్, హెచ్.నర్స్ కె.మణి, పూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌లో స్వచ్ఛత పఖ్వాడా ప్రారంభం



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి, సీఎండీ, డైరెక్టర్లు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌లో శనివారం స్వచ్ఛత పఖ్వాడా ప్రారంభమైంది. ఉక్కు పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్, సీఎండీ అతుల్ భట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారంతా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ ఆదేశాల మేరకు మార్చి 16 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కె.మొహంతి, ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు, పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికి 'సీ' వినతి**

స్టీల్‌ప్లాంట్ సమస్యలు పరిష్కరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్‌ను కోరారు. సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి.ప్రసాద్ శనివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజాన్ని తగినంత సరఫరా చేయడం లేదని, బ్లాస్ట్‌ఫర్నేస్-3 మూసివేశారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అధికారుల వేతన సవరణ, పదోన్నతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

**కూర్మన్నపాలెం:** అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవర్మణానికి పాల్పడిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివి.. బళ్లారిలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఈశ్వరరావు (60) భార్య దుర్గాలక్ష్మితో కలిసి పెదగంట్యాడ మండలం మదీనాబాగ్‌లో నివసిస్తున్నారు. ఈశ్వరరావు కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో దుర్గాలక్ష్మి బంధువుల ఇంట్లో పెళ్లికి విజయనగరం వెళ్లారు. ఆరోగ్యం బాగాలేదని, పెళ్లికి రాలేనని చెప్పి ఈశ్వరరావు ఇంట్లోనే ఉండిపోయారు. తన ఆరోగ్యం కుదుటపడదనే బెంగతో ఉన్న ఈశ్వరరావు తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసి, ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చుట్టుపక్కల వారికి దుర్గంధం రావడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఈశ్వరరావు ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. దీంతో వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుర్గాలక్ష్మికి ఫోన్ చేసి తెలియజేశారు. దుర్గాలక్ష్మి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ

**ఎంవీపీకాలనీ:** జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**అక్కిరెడ్డిపాలెం:** అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ విశాఖపట్నం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని షీలానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచార సభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రచార సభ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా శీలంశెట్టి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నంబారు రాజు, కార్యదర్శిగా మద్దిల గురునాయుడు, సహాయ కార్యదర్శిగా కొట్టనాల రమేష్, కోశాధికారిగా అల్లు నరహరి, డిస్ట్రిక్ట్ కమాండెంట్‌గా గంటి బంగారు నాయుడును, ఇతర ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నట్లు మాజీ అధ్యక్షుడు నాగార్జునరాజు తెలిపారు. సమావేశంలో ఏబీఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూజ గురువులు పైలా ఆదిమోహన్ రెడ్డి, రాష్ట్ర ఎస్ఈసీ మెంబర్ గాడు తాతినాయుడు తదితరులు పాల్గొన్నారు.